క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని యడవెల్లి ఫీడర్, చిల్పకుంట్ల మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ 11కేవీ విద్యుత్ లేన్లలో చెట్లకొమ్మలు తొలగించడం, లూజు వైర్లను సరిచేయడం వంటి పనులు నిర్వహిస్తున్నందున ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి'

తుంగతుర్తి : తుంగతుర్తి అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై ప్రతిపక్ష పార్టీలు నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషితో తిరుమలగిరి మండలాన్ని దళిత బంధు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై చేయించి, నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక చేశారన్నారు. దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై కొంత మంది రాజకీయ లబ్ధికోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఆమెతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

లింగానాయక్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న సురేశ్‌రావు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం ఆవాసం గుడిబండ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగానాయక్(43) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

అర్వపల్లి : జేపీఎస్‌ల సర్వీసున్ క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం నిర్ణయించడంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.నవీన్ రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెహ్రూనాయక్, ఎస్. రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి నారాయణమూర్తి, కావ్య, జ్యోతి, పర్హానా, మహాలక్ష్మి, మాధవిక, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


పిల్లలతో నిర్వాహకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని సీఎస్‌ఐ చర్చిలో పిల్లలకు 14రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పిల్లలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే దిశ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గొల్లబోయిన పుష్పలత జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డి.వినిల్ జాయ్, జ్యోత్స్న, రెంటాల కరుణకుమార్, టీచర్లు పగిడిమర్రి శీల, బి.నరేష్, సంఘస్తులు సైదులు, సౌందర్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో నూతన కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు ఐక్యంగా ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నాగయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, రావుల వెంకటి, కొండ అంజి పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతికి లారీల కొరత

- కాంటా అయిన బస్తాలు కేంద్రాల్లోనే
- విక్రయానికి అవస్థలు పడుతున్న రైతులు
- లారీల కోసం ఎదురుచూపులు
- సమస్య పరిష్కరించి కొనుగోళ్ల వేగం పెంచాలని వేడుకోలు


అర్వపల్లి కేంద్రంలో వర్షంతో తడిసిన ధాన్యం బస్తాలు (ఫైల్)


కొనుగోలు చేయాల్సిన ధాన్యం

అర్వపల్లి : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వరి పండించిన రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎండుతూ వానకు తడుస్తూ పాడవుతుండగా.. మరోవైపు కాంటాలై బస్తాలు కుట్టి వేసి ఉన్న ధాన్యం లారీ కొరతతో మిల్లులకు ఎగుమతి కాక రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉంటున్నాయి. ఈ రోజున్నా లారీలు వసాయోమోనని రైతులు కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. తాజాగా రెండు రోజుల కిందట పడిన అకాల వర్షానికి కాటాలైన ధాన్యం, కేంద్రాలోల్ల పోసిన వరి రాశులు తడిసి ముద్దయ్యాయి. ఎగుమతుల్లో జాప్యంతోనే ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన 30వేల బస్తాల ధాన్యం ఎగుమతి

జాజిరెడ్డిగూడెం మండలంలో యాసంగి సీజన్‌కు గానూ ఇప్పటి వరకు 21 కేంద్రాల ద్వారా సుమారు 5లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. లారీలు సకాలంలో రాక కొనుగోలు కేంద్రాల్లో కాంటాలై ఉన్న 30వేల బస్తాల ధాన్యం ఇంకా ఎగుమతి కావాల్సి ఉంది. అలాగే ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం రాశులు కూడా పెద్ద మొత్తంలోనే కేంద్రాల్లో ఉన్నాయి. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి లారీల కొరతను తీర్చి కాంటాలై ఉన్న ధాన్యాన్ని వెంటనే ఎగుమతి చేసి, కేంద్రాల్లో పోసి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల బాధలు వర్ణనాతీతం



ధాన్యం కొనుగోళ్లలో ఈసారి జరుగుతున్న జాప్యం గతంలో ఎన్నడూ జరుగలేదు. దీని మూలంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్ముకోవడానికి అన్నదాతలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైన రైతుల బాధలను అధికారులు అర్థం చేసుకుని ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలి.

\- వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

లారీల సమస్య పరిష్కరిస్తాం



లారీల కొరతను తీర్చడానికి తగు చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలై ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడానికి ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తున్నాం. వివిధ కారణాలతో లారీలు సకాలంలో రాక కొంత ఇబ్బంది ఏర్పడుతుంది.

\- యాదగిరిరెడ్డి, మండల నోడల్ అధికారి

పోలీస్ పహారాలో తిరుమలగిరి

- అఖిలపక్ష ధర్నాకు వెళ్లకుండా నాయకులు ముందస్తు అరెస్ట్


తిరుమలగిరి చౌరస్తాలో భారీగా మోహరించిన పోలీసులు

తిరుమలగిరి(తుంగతుర్తి) : తిరుమలగిరిలో అఖిల పక్షం ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునివ్వడంతో నియోజకవర వ్యాప్తంగా బుధవారం పోలీసులు అన్ని మండలాల్లో అఖిలపక్షం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. తిరుమలగిరిలో అర్ధ రాత్రి నుంచే అఖిలపక్షం నాయకుల ఇళ్లలోకి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మహాధర్నాకు వస్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సూర్యాపేట- జనగాం రోడ్డు, మోత్కూరు-తొర్రూర్ రోడ్డులో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపారు. సూర్యాపేట డీఎస్పీ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పదిమంది ఎస్‌ఐలు, వందకు పైగా పోలీసులు పహారా నిర్వహించారు.

అరెస్టు అయిననాయకులు

మహాధర్నాకు వస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఆర్టీసీ బస్సులో తిరుమలగిరి చౌరస్తాకు రాగా పోలీసులు గమనించి బస్సులోనే అదుపులోకి తీసుకుని నాగారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, వైఎస్సార్ తెలంగాణ రాష్ట్ర అధికారప్రతినిధి ఏపూరి సోమన్న, అన్నెపర్తి జ్ఞాన సుందర్, పాల్వాయి నగేష్, డాక్టర్ వడ్డెపల్లి రవి,గుడిపాటి నర్సయ్య, బీజేపీ నాయకులు కాపరవిలను స్థానిక చౌరస్తాలో అదుపులోకి తీసుకుని వెంటవెంటనే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'డబుల్' అవకతవకలపై విచారణ చేపట్టాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కోదాడ నియోజకవర్గంలో మోతె మండలం అప్పనగూడెం గ్రామ పంచాయతీలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని సుభాష్‌చంద్రబోస్ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి సోమిరెడ్డి కోరారు. బుధవారం ఈ విషయంపై కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అర్హులు కాని వారికి ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సమక్షంలో నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి


ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు


తిరుమలగిరిలో..

సూర్యాపేట : పరిసరాల పరిశుభ్రతకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బుధవారం 45వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రతి వార్డులో వర్షాకాలానికి ముందే డ్రెయినేజీల పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలని, డ్రెయినేజీ కాలువలలో వ్యర్థాలను వేయడం వలన దోమలు చేరి రోగాల బారిన పడాల్సి వస్తుందని, కాబట్టి ఇంట్లోని తడిచెత్తను మున్సిపాలిటీ ట్రాక్టర్‌కు ఇవ్వాలన్నారు. 45వ వార్డులో వేసవి సెలవుల్లో 100మంది విద్యార్థులకు చెస్ ఆటలో శిక్షణ ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి కృపాకర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, నూకల వెంకట రెడ్డి, మీలా వంశి, వైద్యులు డాక్టర్ తోట కిరణ్, డాక్టర్ దేవరశెట్టి దినేష్, ప్రభాకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా 12, 13 వార్డులలో పిచ్చి మొక్కలు తొలగించి మురికి కాల్వల్లో మట్టిని బుధవారం సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంకెపల్లి జ్యోతి, పత్తెపురం సరిత, వార్డు ఆఫీసర్ వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌పై యువత దృష్టి సారించాలి

- మంత్రి జగదీశ్‌రెడ్డి


యువతకు క్రీడా సామగ్రి అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : అథ్లెటిక్స్‌పై యువత దృష్టి సారించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అందుకు అనువైన మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన పేర్కన్నారు.బుధవారం గ్రామీణ యువతకు క్రీడా సామగ్రిని సొంత నిధులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువుతో పాటూ క్రీడా రంగంలో యువత రాణించాలని ఆయన సూచించారు. మానసిక రుగ్మతలను క్రీడలతో రూపుమావవచ్చన్నారు. మానసిక ఉల్లాసంతో పాటూ దేహాదారుడ్యానికి క్రీడలు దోహదపడుతాయన్న విషయాన్ని విస్మరించరాదన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఖర్చుకు వెనకాడకుండా క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సంకల్పసిద్ధిలో విద్యార్థి, యువత భాగస్వామ్యం అయి క్రీడల్లో సూర్యాపేటను ఒక ఐకాన్‌గా నిలపాలని మంత్రి విద్యార్థి, యువతకు పిలుపునిచ్చారు.

పేటలో వెలుగుల శోభ

పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హెడ్ పోస్ట్ ఆఫీస్ నుంచి ఎస్వీ డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాల వరకు రూ. 21.69లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన బీటీ రోడ్డు, సైడ్‌డ్రెయిన్, ఫుట్‌పాత్, సెంట్రల్ మీడియన్, గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణాన్ని చేపట్టారు. బుధవారం రాత్రి సెంట్రల్ లైటింగ్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మున్సిపల్ కమీషనర్ రామానుజులరెడ్డి, స్థానిక కౌన్సిలర్ తాహేర్‌పాషా, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ హబ్ ప్రారంభం

సూర్యాపేట రూరల్ : పట్టణంలోని రాయినిగూడెం సమీపంలో వోల్ట్రాన్ ఎలక్ట్రిక్ చార్జింగ్ హబ్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు తెలంగాణలో నూతన పారిశ్రామిక విధానంలో పారిశ్రామిక వేత్తలకు సులభంగా అనుమతులు లభిస్తున్నాయన్నారు. ఎలక్ట్రిక్ చార్జింగ్ హబ్ ఏర్పాటుతో సూర్యాపేట పట్టణంలో పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గండూరి ప్రకాష్, బైరు వెంకన్న, జ్యోతికరుణాకర్, ఉప్పల ఆనంద్, తోట శ్యామ్‌ప్రసాద్, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మిప్రసాద్, బండారు రాజా, వోల్ట్రాన్ కంపెనీ ప్రతినిధులు రవిశంకర్, రాజా, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలే తెలంగాణలో పునరావృతం

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి దయాకర్


అర్వపల్లి స్టేషన్‌లో అద్దంకి దయాకర్, తదితరులు

అర్వపల్లి : కర్ణాటక ఫలితాలే తెలంగాణ రాష్ట్రంలో పునరావృతం కానున్నాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. తిరుమలగిరిలో జరిగే అఖిలపక్షాల ఆందోళన కార్యక్రమానికి హాజరుకావడానికి వెళ్తుండగా బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి అర్వపల్లి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తిరుమలగిరి మండలంలో జరిగిన దళితబంధు పథకం అమలులో రూ.65 కోట్లు పక్కదారి పట్టాయని విమర్శించారు. దళితబంధు పథకం ఇక్కడ అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. ఇక్కడ ఎవరైనా అవినీతి గురించి మాట్లాడితే బీఆర్‌ఎస్ పార్టీ దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అక్కెనపల్లి రమేష్, పి.సత్తమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


శాంతినగర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కూరం మణి

నాగారం : అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడొద్దని రాష్ట్ర ప్రభుత్వం కంటివెగులు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో 85మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శోభారాణి, సర్పంచ్ ఎస్.కె.నాగుల్‌మీరా, ఉపసర్పంచ్ పొదిల శ్రీను, డాక్టర్ హర్షవర్ధన్, అప్తోమెటిస్ట్ డాక్టర్ కె.ఉమ, పంచాయతీ కార్యదర్శి వీరేందర్, వైద్య సిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా


కొమ్మాలలో మహిళను సన్మానిస్తున్న పోస్టల్ సిబ్బంది

అర్వపల్లి: మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మాలలో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలపరిమితికి కనిష్ఠంగా రూ.1000, గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు మహిళలు డిపాజిట్ చేసుకునే అవకాశం ఉందని ఇందుకు గాను గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీ రేటు లభిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో 110 సేవింగ్ ఖాతాలను తెరిచిన బీపీఎంను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గొని సురేష్‌గౌడ్, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ రేణుక, ఎంఓ అప్పయ్య, బీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నీటి సమస్య లేకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిలుకూరు : గ్రామాల్లోని నర్సరీల్లో నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ ఈదయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీలలో మొక్కలు, పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ పాండు యాదవ్, ఏపీఓ నిర్మల, ఈసీ మాధవి, టీఏలు స్రవంతి, గిరి ప్రసాద్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల ముందస్తు అరెస్ట్


మద్దిరాలలో అరెస్టయిన బీజేపీ నాయకులు


అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ..


నాగారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

తుంగతుర్తి : దళితులకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ తిరుమలగిరి మండల కేంద్రంలో చేపట్టిన అఖిలపక్ష ధర్నాకు నాయకులు వెళ్లకుండా పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయి బాబా మాట్లాడుతూ నియోజకవర్గంలో రోజు రోజుకు ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. అధికార పార్టీకి పోలీసులు తొత్తుగా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అరెస్టయిన వారిలో అఖిలపక్షాల నాయకులు తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : తిరుమలగిరిలో జరిగే అఖిలపక్ష పార్టీల ఆందోళనకు వెళ్లకుండా ముందస్తుగా మండలంలోని కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నాయకులను ఎస్‌ఐ అంజిరెడ్డి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఆందోళనకు వెళ్లకుండా ముందస్తుగా మండలంలోని కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులను ఎస్సై అంజిరెడ్డి బుధవారం అరెస్ట్ చేసి బైండోవర్ చేశారు. అరెస్టైన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, బీజేపీ నాయకులు పాక వీరేష్‌యాదవ్, బైరబోయిన నాగయ్య, సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ నసీర్‌గౌడ్, రాంబాబు, నరేష్, రాజు, విజయ్‌కుమార్, సతీష్, సంపత్, శ్రీకాంత్, మనోహర్, కిరణ్ ఉన్నారు.


నాగారం : తిరుమలగిరి మండల కేంద్రంలో అఖిల పక్షాల ఆధ్వర్యంఒల చేపట్టిన ధర్నాకు బీజేపీ నాయకులు వెళ్లకుండా ఎస్‌ఐ జి.ముత్తయ్య బుధవారం మండల కేంద్రంలో అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జీ కడియం రామచంద్రయ్య పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో యాదగిరి, చిరంజీవి పాల్గొన్నారు.

మద్దిరాల : లాయర్ యుగేందర్‌పై బీఆర్‌ఎస్ నాయకుల దాడికి నిరసనగా బుధవారం తిరుమలగిరి చేపట్టిన అఖిలపక్ష ధర్నాకు తరలివెళ్లకుండా పోలీసులు నాయకులు ముందుస్తుగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జలగం అచ్చయ్యగౌడ్ నాయకులు బొమ్మెర వెంకన్న, బీసు చిన్న వీరన్న, భాషబోయిన వెంకన్న పాల్గొన్నారు.

బ్రాంచ్ పోస్టుమాస్టర్‌కు సన్మానం

మునగాల : మహిళా సమ్మాన్ సేవింగ్స్ పోస్టల్ ఖాతా గురించి విస్తృత ప్రచారం చేసి 182 మంది మహిళలతో ఖాతాలు తెరిపించేందుకు కృషి చేసిన మండలంలోని మాధవరం బ్రాంచ్ పోస్టుమాస్టర్ జ్యోతిని బుధవారం తపాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, ఐపీఓ గొని సురేష్‌గౌడ్‌లు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే పోస్టుమాస్టర్ జ్యోతికి సహకరించిన సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఓ అప్పయ్య, మహిళలు మేడం పున్నమ్మ, రేవతి, గ్రామస్తులు దతదితరులు పాల్గొన్నారు.

లింగవివక్ష నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న చిప్పలపెల్లి రవి

నూతనకల్ : లింగవివక్ష నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ చిప్పలపెల్లి రవి కోరారు. బుధవారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఐసీడీఎస్, ఎంవీఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ బాలికల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న లింగ వివక్షతను నిర్మూలించడంలో తల్లిదండ్రులదే ప్రధాన పాత్ర అని ఆయన తెలిపారు. బాలురలతో పాటు బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తూ ఉన్నత విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అరుణ, రేణుక, ప్రణతి, సారిక, మీనాక్షి, దీపిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా గోవిందరావు

హుజూర్‌నగర్ : జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన బొడ్డు గోవిందరావును నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు మాడ రాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గోవిందరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలి


పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారులోని సర్వేనంబర్ 9లో ఉన్న 2.20 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన గుండెబోయిన లింగయ్య ఆక్రమించి, అందులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి సబంధిత భూమికి హద్దు రాళ్లు పాతి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మరిపడగ సైదులు, షేక్ బాబు పాల్గొన్నారు.